

## ఘనంగా ఓనం సంబరాలు...

**కెపిహెచ్బి కాలనీ, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** మలయాళీల పవిత్ర పండుగ అయిన కోణం వేడుకలను కూకట్ పల్లిలోని లులు మాల్‌లో ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్లు మాల్ రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్ తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పూల రంగోలి నిర్వహించారు. ఈ పోటీల్లో కస్టమర్లతోపాటు మాల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం వడంవాలి (టగ్ ఆఫ్ వార్), మావెలి మీట్ అండ్ గ్రీట్, సింగారి మేళం ఉంటుందని, ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మాల్ మేనేజర్ ఎడిల్ అరసన్ పేర్కొన్నారు. సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, మాల్‌కి వచ్చి ఓనం సంబరాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఓనం సందర్భంగా హైపర్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పాయసం మేళలో వివిధ రకాల పాయసం వంటకాలు అందుబాటులో ఉంచారు.



హైదరాబాద్ వార్త

# గణేశా ఇక సెలవ్



గురువారం ఖైరతాబాద్ గణేశుని దర్శించటానికి వచ్చిన భక్త జనం

**ఖైరతాబాద్‌లో అర్ధరాత్రి నుంచి నిలిపివేసిన దర్శనాలు**

**తొమ్మిది రోజుల్లో 30లక్షల మంది భక్తులు రాక**

**నిమజ్జనం కోసం విజయవాడ నుంచి రప్పించి భారీ ట్రాలీ**

**26 టైర్లు, 75 అడుగుల పొడవు..11 అడుగుల వెడల్పు**

**హైదరాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త ;** మహా గణపతిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో ఖైరతాబాద్ పరిసరాలు భకనత జనసంద్రంగా మారాయి. నిమజ్జనం సంబరాలు మొదలైన వేళ అందరి చూపు ఖైరతాబాద్ గణనాథుడిపైనే ఉంది. ముందస్తు నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా బడా గణేశ్ దర్శనానికి గురువారం చివరి రోజు అర్ధరాత్రి 12 గంటల వరకు అనుమతి ఇచ్చారు. ఇక ఇప్పటి వరకు దాదాపు 30 లక్షల మంది భక్తులు గణనాధుడిని దర్శించుకున్నారు. అర్ధరాత్రి తర్వాత మహా గణపతికి కలశ పూజ నిర్వహించారు. నిమజ్జనం కోసం కోసం విజయవాడ నుండి భారీ టస్కర్ తెప్పించారు నిర్వాహకులు. బుధవారం రాత్రి భారీ ట్రాలీ ఖైరతాబాద్ చేరుకుంది. మహాగణపతి విగ్రహాన్ని సాధారణ ట్రక్కులపైన తీసుకెళ్లేందుకు వీలు కాదు. అందుకే ప్రత్యేకంగా రూపొందించిన వాహనాన్ని ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం కోసం ఏపీ నుంచి తెప్పించారు. విజయవాడ నుంచి వచ్చిన భారీ టస్కర్‌పై వెల్డింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఖైరతాబాద్ గణేషుడి ఎత్తు 69 అడుగులు, వెడల్పు 28 అడుగులు కాగా.. విగ్రహాన్ని టస్కర్ పై సక్రమంగా అమర్చేందుకు వీలుగా దానిపై వెల్డింగ్ పనులు జరగనున్నాయి. వెల్డర్ నాగబాబు ఆధ్వర్యంలో 20 మంది వర్కర్లతో పనులు జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 9 రోజుల పాటు పూజలు అందుకున్న ఖైరతాబాద్ బడా గణేషుడు ఈనెల 6న శనివారం నిమజ్జనం కానున్నాడు. హుస్సేన్ సాగర్లో ఈ భారీ గణపతి నిమజ్జనం జరగనుంది.

**విజయవాడ నుంచి భారీ టస్కర్.. ప్రత్యేకతలు..**

చిన్ని విగ్రహాల తరలింపుకే పెద్ద పెద్ద వాహనాలు, ట్రక్కులు, క్రేన్‌లు వినియోగిస్తుంటారు. మరి అలాంటిది..40 నుంచి 50 టన్నుల బరువు, 69 అడుగుల ఎత్తు ఉన్న లంబోదరుడిని ఎలా తరలిస్తారో తెలుసుకోవాలని చాలా మంది భక్తుల్లో ఉంటుంది. అయితే ఈ భారీ గణేష్ నిమజ్జనం కోసం ట్రక్కులను మించిన బాహుబలి ట్రక్కును తెప్పించారు నిర్వాహకులు. విజయవాడ నుంచి తెప్పించిన ఈ భారీ టస్కర్‌కు 26చక్రాలు ఉంటాయి.75 అడుగుల పొడవు,11 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ టస్కర్‌కు 100 టన్నుల బరువును మోసే సామర్థం ఉంటుంది. విగ్రహం కదలకుండా ఉండేలా ఐరన్ స్తంభాలతో బేస్ ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి టైంలో బడా గణపతిని టస్కర్ పైకి ఎక్కిస్తారని.. ఆ వెంటనే సపోర్టింగ్ వెల్డింగ్ చేస్తారని నిర్వహకులు తెలిపారు. శుక్రవారం నుంచే గణపతి మండపం చుట్టూ ఉన్న షెడ్డు తొలగించేస్తారు. రాత్రి 12 గంటలకు కలశ పూజ చేయించి.. విగ్రహాన్ని శోభాయాత్రకు రెడీ చేస్తారు. మిగతా 3లో

### 36గంటల పాటు వైన్ షాపులు బంద్..

గణేష్ నిమజ్జనం సందర్భంగా నగరంలో బార్లు, వైన్స్, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలపై ఆంక్షలు విధించారు నగర పోలీసులు. ఈనెల 6న నగరంలో 36 గంటలపాటు అన్ని మద్యం దుకాణాలను బంద్ చేయాలని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. సీపీ సివి ఆనంద్ నోటిఫికేషన్ ప్రకారం..ఈ నెల 6వ తేదీ శనివారం ఉదయం 6 గంటల నుంచి 7వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు 36 గంటలపాటు హైదరాబాద్ జంట నగరాల్లో వైన్సులు, బార్లు, రెస్టారెంట్లు, కల్లు దుకాణాలను మూసివేయాలని మిగతా 3లో



ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్లు

లంబోదరుడిని సాగనంపటానికి వచ్చిన యువ భక్త బృందం

### నిమజ్జనాల సందడి షురూ..

**ముషీరాబాద్ :** లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. వినాయకచవితి పండుగ రోజు నుంచే ఇక్కడ నిమజ్జనాలు చేసుకునేందుకు పాంట్‌లు ఏర్పాటుచేసినట్లు దోమలగూడ సిఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఐదు అడుగల విగ్రహాల వరకు ఎన్టీఆర్ స్టేడియంలో నిమజ్జనాలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. గత వారం రోజులుగా వందలాది మంది తమ విగ్రహాలను ఇక్కడ నిమజ్జనం చేస్తున్నారు.





బోరబండలో ఓ క్లినిక్‌ను సీజ్ చేసిన దృశ్యం

## డూప్లి'కేటు' డాక్టర్లకు సంకెళ్లు!

**బోరబండలో ప్రైవేట్ క్లినిక్‌ల్లో ఆకస్మిక తనిఖీలు**

**కనీస అర్హత లేకుండానే వైద్యం**

**పలువురు నకిలీల అరెస్ట్, క్లినిక్‌లూ సీజ్**

**యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు నకిలీ డాక్టర్ల క్లినిక్‌లను అధికారులు సీజ్ చేశారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్, విజిలెన్స్ బృందాలు గురువారం ఆకస్మికంగా చేసిన తనిఖీల్లో పలు దారుణాలు వెలుగు చూశాయి. ఎలాంటి వైద్య విద్యార్హత లేకుండానే ప్రాక్టీస్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారి లాలయ్య, విజిలెన్స్ ఆఫీసర్ మేకల రాకేష్ ఫిర్యాదు మేరకు ఎస్వోటీ అధికారులు బోరబండ ప్రాంతంలో ఉదయం, రాత్రి తనిఖీలు నిర్వహించారు.

టి.అంజయ్యనగర్, ఇంద్రానగర్‌లో జయశ్రీ(దర్శిత క్లినిక్), ఎస్పీఆర్ హిల్స్ ఆరోగ్యనగర్‌లో సునీత (ప్రథమ చికిత్స సెంటర్), ఆలికొండ పాపయ్య (లైఫ్‌కేర్ శ్రీసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్), లక్ష్మణ స్వామి, అబీబ్‌ఫాతిమానగర్‌లో అశోక్ ముదిరాజ్(వెల్‌నెస్ పాలీ క్లినిక్)లకు ఎటువంటి అనుమతీ లేదని, ఎలాంటి విద్యార్హత లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్నారని ఎస్ఓటీ అధికారులు గుర్తించారు. వీరిపై కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఆయా క్లినిక్‌లను సీజ్ చేశారు. ఆరోగ్యనగర్‌లో సునీతా ప్రథమ చికిత్స సెంటర్‌ను గతంలో కూడా జీహెచ్ఎంసీ మెడికల్ కౌన్సిల్ అధికారులు సీజ్ చేసినప్పటికి ఓ రాజకీయ నాయకుడి అండదండలతో తిరిగి ప్రారంభించుకుని యథావిధిగా కొనసాగిస్తున్నారని స్థానికులు నిరసన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నిమార్లు అధికారులు వార్నింగ్ ఇచ్చినా తీరు మారకపోవడంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే తరహాలో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ నకిలీ వైద్యులకు అడ్డాగా మారుతోంది. ఇటీవల పలు ప్రాంతాలలో మెడికల్ కౌన్సిల్, విజిలెన్స్‌లు దాడులు చేసి ఇప్పటికే పదుల సంఖ్యలో నకిలీ వైద్యులను జైలుకు పంపించారు. ముఖ్యంగా బోరబండ, రహమత్‌నగర్ డివిజన్ల పరిధిలో కొందరు నకిలీ డాక్టర్లు రోగుల ప్రణాలను పణంగా పెడుతున్నారు. బోరబండలో ఇప్పటికే 10 మంది నకిలీ వైద్యుల గుట్టు బయటపడింది.

## డ్రగ్స్ విక్రయాల కోసం 'గే' డేటింగ్ యాప్

**ఇద్దరు పెడ్లర్లతో సహా ఎడుగురు కస్టమర్ల అరెస్ట్**

**పట్టుబడిన వారంతా స్వలింగ సంపర్కులే!**

**అసహజ శృంగారం కోసం 'గ్రైండర్ ఏ' యాప్ వాడకం**

**రూ. 15 లక్షల విలువైన మాదకద్రవ్యాల స్వాధీనం**

**వివరాలను వెల్లడించిన ఈస్ట్‌జోన్ డిసిపి బి.బాలస్వామి**



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డిసిపి బాలస్వామి

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** 'గ్రైండర్ ఏ' అనే 'గే' డేటింగ్ యాప్ ద్వారా డ్రగ్స్ వాడకంతో పాటు సరఫరా చేస్తున్న నిందితుల గుట్టు రట్టు చేశారు చిలకలగూడ పోలీసులు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీం చిలకలగూడ పోలీసులతో కలిసి సీతాఫల్‌మండీలోని ఐడీయల్ అపార్ట్‌మెంట్‌లో దాడులు నిర్వహించి ఇద్దరు పెడ్లర్లతో పాటు ఏడుగురు కస్టమర్లను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ఓ ప్రముఖ హాస్పిటల్ వైద్యుడు ఉండడం గమనార్హం. ఈ మేరకు గురువారం టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ ఎ.శ్రీనివాసరావు, చిలకలగూడ ఏసీపీ కె.శశాంక్‌రెడ్డి, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ బి.అనుదీప్‌తో కలిసి ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసివ వివరాలను వెల్లడించారు. కర్నూలుకు చెందిన ప్రధాన నిందితుడు రమాకాంత్ 2000లో నగరానికి వచ్చి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ, అదే సంవత్సరంలో వివాహం చేసుకున్నాడు. అనంతరం పలు కారణాల వలన మాదకద్రవ్యాలకు అలవాటుపడ్డాడు. అనంతరం శారీరక శక్తిని పెంపోందించుకోవడంతో పాటు యువకులను తన అసహాజ శృంగారంలో పాల్గొనేలా వారికి డ్రగ్స్ అలవాటు చేసి, వారితో లైంగికంగా తృప్తి చెందేవాడు. ఈ క్రమంలో సులువుగా డబ్బు సంపాదించాలని మడవాత్ ప్రసాద్ అనే వ్యక్తితో కలిసి బెంగుళూరులో ఓ నైజీరియన్ వద్ద 1 గ్రాము ఎండీఎంఏ రూ.10 వేల చొప్పున కొనుగోలు చేసి రూ. 15 వేలకు విక్రయించడం ప్రారంభించాడు. గత సంవత్సరం జులైలో పోలీసులకు చిక్కి జైలు పాలయ్యాడు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి తిరిగి అసహజ శృంగారం చేయడంతో పాటు డ్రగ్స్ విక్రయాలను పున: ప్రారంభించాడు. తమ కుమారుడి ప్రవర్తనలపై అనుమానం కలిగిన ఓ తండ్రి ఇచ్చిన సమాచారం మేరకు దర్యాప్తు చేపట్టి పెడ్లర్లు మిగతా 3లో

## అడుగడుగునా ఆంక్షలు

**నిఘా నీడలో వినాయకుడి శోభాయాత్ర**

**రేపు ఉదయం 6 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 10 గంటల వరకు అమలు**

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** నగరంలో వినాయక విగ్రహాల శోభాయాత్ర సాజావుగా సాగేందుకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన శోభాయాత్ర సాగే ప్రాంతాల్లో 6వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సివి.ఆనంద్ వెల్లడించారు. ప్రధాన ఊరేగింపు బాలాపూర్ నుండి గుర్రం చెర్వులోని కట్ట మైసమ్మ ఆలయం వద్ద నుంచి హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత కేశవగిరి, చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్, ఎంబీఎన్ఆర్ క్రాస్ రోడ్, ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జ్, అలియాబాద్, నాగుల్చింత, చార్మినార్, మదీనా, అఫ్జల్‌గంజ్, ఎస్‌ఏ బజార్, ఎంజే మార్కెట్, అబిడ్స్ క్రాస్ రోడ్, బషీర్ బాగ్, లిబర్టీ జంక్షన్ నుంచి ఎన్టీఆర్ మార్గం గుండా అంబేద్కర్ విగ్రహాం నెక్లెస్ రోడ్‌కు చేరుతుంది. ఆయా ఏరియాల నుంచి వచ్చిన ఊరేగింపు ప్రధాన శోభాయాత్ర రూట్లలో కలుస్తాయి. నిమజ్జనం పూర్తయ్యే వరకు భారీ వాహనాలకు నగరంలోకి అనుమతి నిషేధిస్తున్నట్లు తెలిపారు. మిగతా 3లో

## రోబోటిక్ టెక్నాలజీతో స్టార్మ్ వాటర్ డ్రైన్ క్లీనింగ్



మెహదీపట్నం ఎన్ఎండీసీ జంక్షన్‌లో రోబోటిక్ టెక్నాలజీతో స్టార్మ్ వాటర్ డ్రైన్ క్లీనింగ్ పనితీరును పరిశీలించిన చీఫ్ ఇంజనీర్(మెయింటెనెన్స్) సహదేవ్ రత్నాకర్

**పైలట్ ప్రాజెక్ట్‌గా సర్కిల్ 12లో ప్రారంభం**

**జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్**

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** వర్షాకాలం వచ్చిందంటే స్టార్మ్ వాటర్ డ్రైన్‌లు పొంగి పొర్లడం, ట్రాఫిక్ జామ్‌లు, లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురవ్వడం వంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. వర్షపు కాల్వలకు చెత్త, చెదారం అడ్డు పడడం, కాల్వలు దెబ్బతినడం, అధిక వర్షపాతం పడడం వంటి కారణాలతో కాల్వలు పొంగిపొర్లుతుంటాయి. రానున్న రోజుల్లో నగరంలో ఇలాంటి ఘటనలు పునరావృతం స్మార్ట్ పరిష్కారం చూపనుంది జీహెచ్ఎంసీ. గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షపు నీటి కాలువల శుభ్రతకు రోబోటిక్ సాంకేతికతను ఉపయోగించనుంది. మొట్టమొదటగా సర్కిల్ 12లో పైలట్ ప్రాజెక్ట్‌గా స్టార్మ్ వాటర్ డ్రైన్ క్లీనింగ్‌ను ప్రారంభించింది. అధునాతన సీసీటీవీ కెమెరాలు ఉన్న రోబోటిక్ యంత్రాల ద్వారా ప్రధాన రోడ్డుక్రాసింగ్‌లో వర్షపు నీటి కాలువల శుభ్రత చేపట్టగా, చీఫ్ ఇంజనీర్(మెయింటెనెన్స్) సహదేవ్ రత్నాకర్ ఈ విధానంలో క్లీనింగ్ ప్రక్రియను బుధవారం రాత్రి మెహదీపట్నం ఎన్ఎండీసీ జంక్షన్‌లో పరిశీలించారు. నూతన పద్ధతి ముఖ్య లక్ష్యాలు కాలువలలోని అడ్డంకులను ఖచ్చితంగా గుర్తించి, తొలగించడం, బురదను వేగంగా, సమర్థవంతంగా అత్యంత వేగంగా తొలగించడం, వర్షాల సమయంలో నీటి నిల్వలను తగ్గించి, డ్రైనేజ్ సామర్థ్యాన్ని పెంపొందించడం. ఫీల్డ్ స్టాఫ్, ప్రజల భద్రతకు ఎలాంటి హాని జరగకుండా కఠిన భద్రతా ప్రమాణాలను పాటిస్తూ క్లీనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ విధానం సఫలీకృతమైతే జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిల్‌లలో అమలు చేసేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. నగర మౌలిక సదుపాయాల నిర్వహణలో ఇది ఒక ప్రధానమైన మార్పుగా నిలవనుంది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కమిషనర్ మాట్లాడుతూ, రోబోటిక్ టెక్నాలజీతో స్టార్మ్ వాటర్ డ్రైన్ క్లీనింగ్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా నగరంలో ప్రారంభించామని తెలిపారు. ఈ విధానం విజయవంతం అయితే వాటర్ డ్రైన్‌లు పొంగి పొర్లడం, ట్రాఫిక్ జామ్‌లు, లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యే ఘటనలు చాలా వరకూ తగ్గుతాయని చెప్పారు.





## రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడుగా డా. గడ్డం వెంకన్న



**నాంపల్లి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠ పీఠాధిపతి డా. గడ్డం వెంకన్న తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడుగా ఎంపిక య్యారు. ఈమేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి గురువారం రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుల జాబితాను వెల్లడించింది. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ప్రతీయేటా నిర్వహించుకునే ఉపాధ్యాయ దినోత్సవంలో శుక్రవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో జరిగే వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతులమీదుగా డా. గడ్డం వెంకన్న ఈ ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకోనున్నారు. ఆయన గత మూదుదశాబ్దాలుగా మిగతా 3లో







వినాయక నిమజ్జనానికి గ్రేటర్ హైదరాబాద్ ఏర్పాటుచేసిన కృత్రిమ కొలనులు



జలవిహార్‌లో రాజ్‌కుమార్‌గౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న తలసాని

## మంచితనానికి నిలువెత్తు రూపం రాజ్‌కుమార్ గౌడ్

పలువురు ప్రముఖుల నివాళి

**బేగంపేట, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** మంచితనానికి మారు పేరుగా నిల్చిన వ్యక్తి మూల రాజ్‌కుమార్ గౌడ్ అని పలువురు నేతలు స్మరించుకున్నారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వియ్యంకుడు మూల రాజ్‌కుమార్ గౌడ్ దశదిన కర్మను నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌గౌడ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ గౌడ్‌పై ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలు చూసిన ప్రతి ఒక్కరూ భావోద్వేగానికి లోనయ్యారు. రాజ్‌కుమార్ గౌడ్ కుటుంబసభ్యులు, మిత్రులు, బంధువులను ఎట్లున్నారు అంటూ పలకరించిన ఏఐ టెక్నాలజీతో రూపొందించిన వీడియో అక్కడ ఉన్న వారికి కంట కన్నీరు తెప్పించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని, శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు డా.లక్ష్మణ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, దానం నాగేందర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, ఎం ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు కంకర యాదవ్, మహేశ్వరి శ్రీహరి, హేమలత లక్ష్మీపతి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు దేవీ ప్రసాద్, దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, గజ్జెల నాగేష్, పల్లె రవికుమార్ గౌడ్ పలు పార్టీల నేతలు రాజ్‌కుమార్ గౌడ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేసారు.

**రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులకు పరామర్శ**

**అడ్డగుట్ట :** బీఆర్ఎస్ నేత మూల రాజ్‌కుమార్ గౌడ్ కుటుంబ సభ్యులను దశదిన కర్మలో సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. రాజ్‌కుమార్ తో తనకున్న అను బంధాలను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్, కడప జిల్లా మైదుకూర్ ఎమెల్యే పుట్ట సుధాకర్ యాదవ్, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, దేవేందర్ గౌడ్, రాజ్య సభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్, దానం నాగేందర్, దాసోజ్ శ్రావన్, మాజీ ఎంపిలు బూర నర్స య్య గౌడ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, సికిం ద్రాబాద్ బిఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్‌లు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## 12న మహిళలకు ప్రత్యేక ఏఐ శిక్షణ


**నాంపల్లి, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎఫ్‌టిసిసిఐ లేడీస్‌వింగ్ కమిటీ ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించి ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ ఏఐ శిక్షణా శిబిరం ఎఫ్‌టిసిసిఐలో 12వ తేదీ శుక్రవారం రోజంతా నిర్వహించనున్నట్లు ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. మహిళా ప్రొఫెషనల్స్, ఎంటంప్రెన్యూర్స్, స్టార్టప్‌లకు ఐబిఎం, ఐఎస్‌బి నిపుణులు మార్గదర్శకత్వం చేయనున్నారు. టెక్నాలజీ రంగంలో నేటికీ మహిళల ప్రాతినిధ్యం తక్కువగానే ఉందని, ఈ పరిస్థితిని మార్చడమే లక్ష్యమన్నారు. టెక్ బ్యాక్‌గ్రౌండ్ లేనివారికి సులభంగా అర్థమయ్యేలా ప్రాక్టికల్ సెషన్స్ రూపొందించినట్లు రవికుమార్ వివరించారు. ఈ శిక్షణా శిబిరం ద్వారా మహిళలు కేవలం ఏఐ వినియోగదారులుగా కాకుండా ఏఐ సృష్టికర్తలు, నాయకులుగా ఎదగగలరని ఎఫ్‌టిసిసిఐ లేడీస్‌వింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ డా. తస్నీమ్ షరీఫ్ పేర్కొన్నారు. ఈ శిబిరంలో ఐబిఎం ఎగ్జిక్యూటివ్ పార్టనర్ అనురాధ, ట్రెండ్‌వైజ్ అనలిటిక్స్ వ్యవస్థాపకుడు, ఐఎస్‌బి ఏఐ ఫర్ లీడర్స్ ప్రోగ్రామ్‌లీడ్ మోహన్‌లు శిక్షణ ఇస్తారని, హ్యాండ్స్ ఆన్ ఏఐ డెమోలు, జనరల్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ అన్వేషణలతోపాటు నిజజీవిత కేస్ స్టడీస్ బోధనాంశాలుగా ఉంటాయని విశదీకరించారు.



పత్తికుంటలో నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలిస్తున్న సిపి అవినాష్ మహంతి, ఇతర అధికారులు

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలి

**అత్తాపూర్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** విఘ్నేశ్వరుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతం వాతావరరణంలో జరుపుకోవాలని సైబారాబాద్ సిపి అవినాష్ మహంతి పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనాల సందర్భంగా గురువారం రాజేంద్రనగర్‌లోని పత్తికుంటను డిసిపి శ్రీనివాస్, ఎసిపి శ్రీనివాస్, సిఐ క్యాస్ట్రోలతో కలిసి సిపి అవినాష్ మహంతి సందర్శించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.....గణేష్ నిమజ్జనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎలాంటి అవాంచానీయ సంఘటనలు జరగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. నిమజ్జనం ఊరేగింపు మార్గమధ్యంలో ట్రాఫిక్ నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండలప నిర్వాహకులు ఎటువంటి ఆలస్యం లేకుండా విగ్రహాలను నిమజ్జనం చేసి అధికారులకు సహకరించాలని ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర డిసిపి శ్రీనివాస్, ఎసిపి శ్రీనివాస్, ట్రాఫిక్ డిసిపి బాలజీ, సిఐ క్యాస్ట్రో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పాతబస్తీలో విస్తృత బందోబస్తు : డిపిసి స్నేహా మెహ్రా

**చార్మినార్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** శ్రీ గణేష్ నిమజ్జనం సందర్భంగా పాతబస్తీలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశామని దక్షిణ మండలం డిసిపి స్నేహా మెహ్రా అన్నారు. లాల్‌దర్వాజ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన శ్రీ గణ నాధునికి ఆమె పూజలు నిర్వహించారు. ఈ కార్యమ్రంలో ఛత్రినాక ఏసిపి చంద్రశేఖర్, సుల్తాన్ షాహి శ్రీ జగదాంబ మహంకాళీ దేవాలయం కమిటి అధ్యక్షులు రాకేష్ తివారీ, నిర్వహకులు శశాంక్ తివారిలు పాల్గొన్నారు.

# బిసి సబ్‌కోటాపై అసెంబ్లీలో తీర్మానంతో సరా!

### మహిళా బిల్లులో బిసిలకు జనాభా ప్రాతిపదికన చోటివ్వాలి
### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** పార్లమెంటులో పాసైన మహిళ బిల్లులో బి.సి. మహిళలకు జనాభా ప్రకారం సబ్‌కోటా ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో బి.సి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే దానికి సార్థకత లేదన్నారు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బి.సి మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. గురువారం బిసి భవన్‌లో బిసి సంక్షేమ సంఘం మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ జి.పద్మ ఆర్.కృష్ణయ్యను కలిసి ఘనంగా సత్కరించారు. తన నియామకం పట్ల కృతజ్ఞతుల తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బిసి సబ్‌కోటా గురించి అసెంబ్లీలో మొక్కుబడిగా తీర్మానం చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు ఆర్.కృష్ణయ్య వల్లే సాధ్యమైం దని బిసి సంక్షేమ సంఘం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ జి.పద్మ అన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోడి మహిళల పక్షపాతి అని పేర్కొన్నారు. అనంతరం జి.పద్మ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బి.సి రిజర్వేషన్ల కోసం ఆర్.కృష్ణన్న అనేక ధర్నాలు చేశారని గుర్తుచేశారు. 2024లో హైకోర్టులో ఆయన వేసిన పిటిషన్ వల్లే బి.సి రిజర్వేషన్ సాధ్యమైందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షి గా చెప్పడం పట్ల ఆమె సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణా రాష్ట్రంలో బి.సి. మహిళకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి మహిళల పక్షపాతి అని, అన్నీ రంగాలలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆలోచిస్తున్నారని చెప్పారు. బి.సి. మహిళలకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి మహిళా నాయకురాలు అనురాధగౌడ్, భాగ్యలక్ష్మి ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంపి ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న బిసి సంక్షేమ సంఘం మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ జి.పద్మ



మంజూరు పత్రాన్ని సిఈకు అందజేస్తున్న మార్కెట్ ఛైర్మన్ ఆనంద్ బాబు తదితరులు

## మంచినీటి ఎద్దడి నివారణకు రూ.55 లక్షలు

**కంటోన్మెంట్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో మంచినీటి సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.55 లక్షల మంజూరు పత్రాన్ని గురువారం కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు మార్కెట్ యార్డు చైర్మన్ ఆర్.ఆనంద్ బాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ బాబు మాట్లాడుతూ బోయిన్‌పల్లి మార్కెట్‌లో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు రావడంతో వెంటనే ఆయన స్పందించి రూ.55 లక్షల నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేసినట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు కార్యదర్శి వెంకన్న, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్, వెజిటేబుల్ కమీషన్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి, సభ్యులు ప్రభాకర్, దుర్గేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదానం చేస్తున్న జస్టిస్ నాగమారుతిశర్మ, చిత్రంలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి

## అయాచితం శ్రీధర్‌కు సర్వేపల్లి పురస్కారం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** పండితునిగా ఆదర్శవంత ఆచార్య స్థాయి నుంచి దేశ రాష్ట్రపతిగా ఉన్నత పదవికి చేరుకున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులకు స్ఫూర్తి ప్రదాత అని సిబిఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతి శర్మ అన్నారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆచార్యులు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ నేత డాక్టర్ అయాచితం శ్రీధర్‌కు పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ నాగమారుతి శర్మ పురస్కారం బహుకరించి మాట్లాడారు. అయాచితం శ్రీధర్ తెలంగాణ సాహిత్య చైతన్య మూర్తి అని ప్రశంసించారు. పురస్కార గ్రహీత అయచితం శ్రీధర్ మాట్లాడుతూ రాధా కృష్ణన్ పేరిట అవార్డ్‌ను అందుకోవటం గర్వంగా ఉందన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో నేటి నిజం ప్రతిక సంపాదకుడు బైస దేవదాసు గాన సభ పాలక మండలి సభ్యులు గీతా దేవి పాల్గొన్నారు.



శిక్షణా శిబిరంలో పాల్గొన్న మహిళ రైతులు, శాస్త్రవేత్తలు

## పంటల సాగులో డ్రోన్ టెక్నాలజీతో ముందడుగు

### మహిళా రైతులకు శాస్త్రవేత్తలు పిలుపు

**అత్తాపూర్ సెప్టెంబరు4,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మాణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో 40 మంది మహిళా రైతులకు నిర్వహించిన శిక్షణ విజయవంతంగా ముగిసింది. రెండోరోజైన గురువారం సేంద్రియ వ్యవసాయం, వివిధ వ్యవసాయ మరియు ఉద్యాన పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులు చీడపీడల నివారణల పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, డ్రోన్ టెక్నాలజీ వివిధ రకముల వ్యవసాయ ఉద్యాన రంగ సబ్సిడీ స్కీముల వివరములు తెలియజేశారు. వాటిని వినియోగించుకుని వ్యవసాయ ఉద్యాన పంటల సాగులో ముందడుగు వేయాలని సూచించారు. పూల సాగుపై అవగాహన కల్పించారు. క్షేత్ర సందర్శనలో వారి సందేహాలను నివృత్తి చేశారు. మహిళా రైతులకు డ్రై ఫ్లవర్ టెక్నాలజీ వివరించి దాని ద్వారా మరింత లబ్ధి చెందాలని సూచించారు. ఉద్యాన పంటలలో తేనెటీగల ప్రాముఖ్యత, తేనెటీగల పెంపకం గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్ ప్రీతం గౌడ్, డాక్టర్ పి సతీష్, డాక్టర్ టి కిరణ్ బాబు, డాక్టర్ జి జ్యోతి, డాక్టర్ బి అనితకుమారి పాల్గొన్నారు. ఉద్యాన అధికారి ఐశ్వర్య ప్రభుత్వపరంగా అమలవుతున్న వివిధ స్కీంల గురించి వివరించారు.

## జీవితంపై భరోసా కల్పిస్తే ఆత్మహత్యలను నివారించవచ్చు

**బేగంపేట సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** విభిన్నమైన కారణాలతో పూర్తిగా డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్యే శరణ్యం అనుకున్న వారి జీవితాలకు భరోసా కల్పించి ఆత్మహత్యలను నివారించవచ్చని రోష్నీ స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్లు ఆనంద్ దివాకర్, విద్యారెడ్డిలు తెలియజేసారు. గురువారం సింధీ కాలనీలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా తమ సంస్థ ఆత్మహత్యల నివారణకోసం ఎల్వీప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

## అత్యాచారం కేసులో నిందితునికి జైలు శిక్ష

**అల్వాల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి మల్కాజిగిరి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 20 సంత్సరాలు జైలు శిక్షణ విధించింది. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్‌లో నివసించిన ఓ బాలికపై 2022 సంవత్సరంలో ఇదే ప్రాంతంలో నివసించే చంద్రాపురం కాలనీకి చెందిన అడ్డాల నాని(23) అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అప్పట్లో న్యాయస్థానంలో హాజరు పరిచారు. పోలీసులు పక్కా సాక్ష్యాలను సేకరించి కోర్టు సమర్పించగా ప్రభుత్వ న్యాయవాది ప్రభాకర్ రెడ్డి కేసును విదించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 20 సంవత్సరాలు జైలు శిక్ష వేయడంతో పాటుగా వెయ్యి రూపాయలు జరిమానా బాధితురాలికి నష్ట పరిహారంగా రెండు లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చింది.

## నేడు ఆచార్య భూమయ్య సాహిత్య పురస్కార సభ

**చిక్కడపల్లి సెప్టెంబర్ 4 (ప్రభాతవార్త) :** ఈనెల 5న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో ఆచార్య అనుమాండ్ల భూమయ్య సాహిత్య పురస్కార సభ నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురాం తెలిపారు. భూమయ్య రచించిన సి.నారాయణ రెడ్డి కథా కావ్య సమాలోచనం, ఆచార్య అప్పా జోస్యుల సత్యనారాయణ రచించిన పంచవటి కావ్యావిష్కరణ ఉంటుందన్నారు.

# వర్గీకరణ రద్దు కోసం ఉద్యమ బాట

**15న జిల్లా కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు**

**అక్టోబరు 6 నుంచి ప్రజాప్రతినిధుల క్యాంప్ కార్యాలయాల వద్ద బైఠాయింపు**

**డిసెంబరు నెలాఖరుకు సచివాలయం ముట్టడి**

**పోరాట సమితి ఛైర్మన్ వడ్డమూరి వెల్లడి**

**సైఫాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ రద్దు కోసం భవిషత్తు కార్యాచరణను రూపొందించామని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఛైర్మన్ వడ్డమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. గురువారం సమితి కేంద్ర కార్యాలయంలో జరిగిన పోరాట సమితి భాగస్వామ్య సంస్థల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15వ తేదీన వర్గీకరణకు వ్యతిరకంగా జిల్లా కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు, అనంతరం జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాల సమర్పణ, అక్టోబరు 6 నుంచి మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్యాంప్ కార్యాలయాల ఎదుట ఆందోళనా కార్యక్రమాలు జరుగుతాయని, డిసెంబరు నెలాఖరకు 'చలో హైదరాబాద్' పేరిట సచివాలయం ముట్టడి కార్యక్రమం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. వర్గీకరణ విషయంలో రేవంత్‌రెడ్డి, కే ంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బిజెపి నాయకత్వం మంద కృష్ణ మాదిగతో కుమ్మక్కైందని, అసెంబ్లీలో వర్గీకరణ చట్టం చేయడానికి మాల ప్రజాప్రతినిధులు సహకరించారని ఆయన ధ్వజమెత్తారు. 58 ఎస్సీ కులాలకు వారు ప్రజా ద్రోహం చేశారని, మాల జాతికి వెన్నుపోటు పొడిచారని, ఇలాంటి జాతి ద్రోహులకు తెలంగాణలో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు, ఆర్‌పిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.అశోక్, నాయకులు రాయప్ప, పి.రాజలింగం, పి.సుచంద్ర, గంధం శంకర్, బత్తుల సత్యనారాయణ, చిప్పరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

## అంబర్‌పేట గంజాయి స్వాధీనం

**హైదరాబాద్ సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** అంబర్‌పేట రమణ థియేటర్ వద్ద గంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తిని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. కొవ్వూరి ఆనంద్ అనే వ్యక్తి నుంచి 460 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్ డీటీ టీం సీఐ నాగరాజు తన బృందంతో కలిసి ఈ దాడులు నిర్వహించారు. నిందితుడితో పాటు, అతని సెల్‌ఫోన్, స్వాధీనం చేసుకున్న గంజాయిని తదుపరి విచారణ నిమిత్తం కాచిగూడ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

# నయనానందకరం రసబివా చారిత్రాత్మక కళావైభవం

**ఆకట్టుకున్న అల్లూరి , భగవద్గీత మహత్యం నృత్యప్రదర్శనలు**

**రవీంద్రభారతి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** కేంద్రప్రభుత్వ సాంస్కృతికశాఖ ఒడిస్సా డ్యాన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడిన రసబివా చారిత్రాత్మక కళావైభవం నయనానందకరంగా సాగింది. భారతీయ వారసత్వ కళాసంపదను సజీవంగా ఉంచుతూ సంప్రదాయాలను గౌరవించే మధుర క్షణాలను శాశ్వత జ్ఞాపకాలుగా మలిచేందుకు కళ సంస్కృతి ద్వారా ఒక అసాధారణ ప్రయాణంలో భాగంగా శంకరానంద కళాక్షేత్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గురు ఆనందశంకర్ జయంత్-బృందంచే భరతనాట్యం శైలిలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను కళ్ళకుకట్టుతూ మణ్యం వీరుడు అల్లూరి సీతారామరాజు; ఒడిస్సా డ్యాన్స్ అకాడమీ భువనేశ్వర్ ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గురు అరుణ మొహంతి-బృందంచే ఒడిస్సీ నృత్యశైలిలో భగవద్గీత దివ్యసందేశం తత్వశాస్త్రం భగవద్గీత మహాత్మ్యం నృత్యరూపకాలు జాతీయ కళావేదిక రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం రాత్రి నేత్రపర్వంగా ప్రదర్శించబడ్డాయి. మన సంస్కృతి కళా సంప్రదాయ వారసత్వం, చరిత్ర సజీవంగా ఉందని నిరూపిస్తూ నృత్యకళాకారుల మార్షల్ ఆర్ట్స్, త్రిల్లింగ్ ఫైట్స్ సన్నివేశాలు, నాట్య విన్యాసాలు గగుర్పొల్పి ప్రేక్షకుల హృదయాలకు హత్తుకుపోయాయి. సుప్రసిద్ధ నాట్యగురువులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలైన ఆనందశంకర్ జయంత్, అరుణ మొహంతిల దర్శకత్వంలో చిరస్మరణీయంగా ఈ రెండు నృత్యరూపకాలు రూపుదిద్దుకొని అలరించాయి.



రసబివా చారిత్రాత్మక కళాప్రదర్శనల్లో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు, భగవద్గీత మహత్యం దృశ్యాలు

## 10న ఉపాధ్యాయ సన్మానం

**అత్తాపూర్ సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** రాజేంద్రనగర్ మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈ నెల 10 న సన్మానం కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శంకర్ రాథోడ్ తెలిపారు. గురు వారం మైలర్‌దేవ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసం ఎమ్మెల్యే ప్రకాష్‌ని ఎంఈఓ శంకర్ రాథోడ్ మర్యాదపూర్వకంగా కలసి ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైకావాలని ఆహ్వానం అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.....అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడ హాజరైవుతారని మండల ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

## జిఎస్‌టి సవరణతో సామాన్యులకి మేలు

**ముషీరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన జిఎస్‌టి స్లాబుల సవరణ సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మట్లాడారు. అధిక ధరలతో అల్లాడుతున్న పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలలో వెలుగులు ప్రసరించే విధంగా జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయాలు తీసుకోవటం అభినందనీయమన్నారు.

## ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

**బంగారం, వాహనాలు స్వాధీనం**




వివరాలు వెల్లడిస్తున్న ఇన్స్పెక్టర్ మక్బూల్‌జానీ

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** చైన్ స్నాచింగ్లకు పాల్పడుతున్న ముత్త బీరయ్య అలియాస్ అనిల్ (32), కమల శ్రీధర్ (32)ను నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు గొలుసు ద్విచక్ర వాహానాలను స్వాధీనం చేసు కున్నారు. ఇంటికి వెళ్తున్న జూపల్లి వీరమ్మ (70) మెడలోని మూడు న్నర తులాల బంగారు పూస్తేల తాడును బలవంతంగా గుర్తు తెలియని వ్యక్తులు పారిపోయారని సిఐ మక్బూల్ జానీ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా మోటార్ సైకిల్ నంబర్ గుర్తించి నిందితులను పట్టుకు న్నామన్నారు. వారి వద్ద నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసు, బజాజ్ పల్సర్ 150 సిసి (టీఎస్10 ఎఫ్ బి 5239) మోటార్ సైకిల్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు ఛేదనలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిం చాయని, ప్రతి గ్రామము, కాలనీలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



అన్నప్రసాద వితరణ చేస్తున్న ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు, ట్రెజరర్ ఏ.రాజేష్ తదితరులు

## పాత్రికేయుల అన్న ప్రసాద వితరణ


**హైదరాబాద్, సెప్టెంబరు 4, ప్రభాతవార్త :** సోమాజిగూడ లోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో కొలువుదిరిన గణనాథుని చెంతన గురు వారం అన్నదాన వితరణ నిర్వహించారు. తొలుత ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఏకదంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతనం 1000 మంది భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల నాయుడు మాట్లాడుతూ గణపతి ఉత్సవాలతో పాటు మతాలకతీతంగా ప్రతి పండుగను అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ భవిష్యత్ తరాలకు సంస్కృతి సాంప్రదాయాలను అందించడంలో క్లబ్ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ రమేష్ వైట్ల, చిలుకూరి హరి ప్రసాద్, ట్రెజరర్ ఏ.రాజేష్ కార్యవర్గ సభ్యులు బాపురావు, పద్మావతి, శ్రీనివాస్ తీగుల్ల తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై టెలీఎడ్యుకేషన్ సేవలు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** గ్రామ్ సమృద్ధి ప్రోగ్రాం, డిజిటల్ భారత్ నిధి కింద గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ కంట్రోల్ జనరల్ ఆఫ్ కమ్యునికేషన్స్ అండ్ ఎకౌంట్స్ వందనాగుప్తా వివరించారు. గురువారం జరిగిన సమావేశంలో ఐదు రాష్ట్రాల సెంట్రల్ జోన్ సమీక్షా సమావేశంలో ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యునికేషన్ అకౌంట్స్ తెలంగాణ సర్కిల్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వందనాగుప్తా మాట్లాడుతూ ఇందులో భాగంగా సబ్సిడీపై టెలీఎడ్యుకేషన్, టెలీ హెల్త్ వంటి సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. టెలీ డెన్సిటీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 95శాతం అంటే దాదాపు 8.24 కోట్ల వినియోగదారులు ఉన్నారన్నారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో సెంట్రల్ జోన్ పరిధిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్, ఒడిశా రాష్ట్రాల నుంచి రూ.4149.27 కోట్లు రాగా ఇందులో తెలంగాణ నుంచి రూ.992.12 కోట్లు, ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.829 కోట్లు ఆదాయం లభించిందన్నారు. కాగా ప్రస్తుతం పెన్షనర్లు 39,541 ఉన్నారని, డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపులు, పెన్షన్ అదాలత్ల ద్వారా మద్దతు లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా పెన్షనర్లను సత్కరించారు.

## చిలకలగూడలో బైక్ దొంగల జంట అరెస్ట్

**సికింద్రాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** ఆసుపత్రుల వద్ద వాహనాలను లక్ష్యంగా ఎంచుకొని దొంగతనాలకు పాల్పడిన జంటను పట్టుకుని, వారివద్ద నుండి చిలకలగూడ పోలీసులు ఆరు బైకులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్లంబర్ పనులు చేసే అలేర్ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన కోటగిరి వినోద్ గౌడ్ (30), కూలి పనులు చేసే అలేర్ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన గండభోయిన పావని (19), గతనెల ఆగస్టు 20న వంశీ అనే వ్యక్తి తన తండ్రి చెకప్ కోసం గాంధీ ఆసుపత్రికి వచ్చాడు. పార్కింగ్‌లో ఉంచిన హీరో హోండా స్ప్లెండర్ బైక్ (టీఎస్08ఈకె0136)దొంగిలించబడింది. దీనిపై వంశీ ఫిర్యాదు చేయగా, చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులోనిందితుడు కోటగిరి వినోద్ మద్యానికి, సిగరెట్లకు బానిసయ్యాడు. డబ్బు కోసం భార్య పావనితో కలిసి ఆసుపత్రుల వద్ద వాహన దొంగతనాలకు పాల్పడటం మొదలుపెట్టాడు. గాంధీ ఆసుపత్రి, భువనగిరి ఏరియాలో ఎక్కువగా బైక్‌లు దొంగిలించారు. ఇప్పటి వరకు మొత్తం ఆరు బైకులు అపహరించినట్లు పోలీసులు నిర్ధారించారు. సెప్టెంబర్ 3న ఉదయం నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా వారివద్ద నుండి 6 రెండు చక్రాల వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో 4 బైకులుభువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 బైకులు పోలీసుల బృందం ఈ ఆపరేషన్‌ను ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బి. బాలస్వామి, అదనపు డీసీపీ జె. నర్సయ్య పర్యవేక్షణలో, ఏసీపీ కె. శశాంక్ రెడ్డి నేతృత్వంలో ఇన్స్పెక్టర్ బి. అనుదీప్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ కె. రమేశ్ గౌడ్, ఎస్సై జె. రాకేష్, క్రైమ్ సిబ్బంది సి. జగదీశ్, షేక్ మదర్ బాషా, బి. గణేష్, వినయ్ కుమార్, డి.కృష్ణలతో కూడిన బృందం విజయవంతంగా పట్టుకుంది. వీరికి తగిన ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.



చోరీ వివరాలను వెల్లడిస్తున్న సీఐ అనుదీప్, డీఐ రమేష్

## ఘనంగా గణేష్ ఉత్సవాలు



భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్ రెడ్డి, కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి, గొట్టిపర్తి శ్రీనివాస్ గౌడ్ తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబరు 4, ప్రభాతవార్త:** ముసారాంబాగ్ గడ్డి అన్నారం గౌడ బస్తి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం గణేష్ మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముసారాంబాగ్ డివిజన్, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్ రెడ్డి, కొత్తగా అరుణ రవీందర్ రెడ్డిలు విచ్చేసి నిర్వాహకులు గొట్టిపర్తి శ్రీనివాస్ గౌడ్, మాడుగుల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గొట్టిపర్తి శ్రీనివాస్ గౌడ్, మాడుగుల శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ సుమారు 3 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, వినయ్ గౌడ్, వెంకటేష్ గౌడ్, సుధీర్ గౌడ్, శ్రీనివాస్ పిల్లాయి తదితరులు పాల్గొన్నారు.

## గరుడ అభయాంజనేయ స్వామి దేవాలయంలో గణేష్ ఉత్సవాలు



గణేష్ లడ్డూలను వేలంలో దక్కించుకున్న భక్తులను అభినందిస్తున్న దేవాలయం కార్యవర్గం కమిటీ సభ్యులు

**మలక్ పేట్ ,సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:** మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లోని శ్రీ శ్రీ గరుడ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ శ్రీ గరుడ అభయాంజనేయ స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు, తెలంగాణ చాంబర్ ఆఫ్ ట్రేడ్స్ ప్రతినిధులు, మలక్ పేట గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు, అర్చకస్వామి సభ్యుల ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా దేవాలయంలో గణపతి హోమము, విఘ్నేశ్వరుని పంచామృత అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గణేష్ పెద్ద లడ్డును వేలం పాటలో మమత ట్రేడర్స్ నిర్వాహకులు పంతులు శ్రీను రూ. 70, 002లకు దక్కించుకున్నారు. అదేవిధంగా చిన్న లడ్డును వేలంపాటలో రూ. 36,500 కు బాలా ఎంటర్ప్రైజెస్ నిర్వాహకులు అయ్యవారి పాండు దక్కించుకున్నారు. వేలంపాటలో లడ్డులను దక్కించుకున్న భక్తులను నిర్వాహకులు పుష్పగుచ్ఛలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం గణేష్ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో మేళ తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## పూజలందుకుంటున్న గణనాథుడు



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్లోని వివిధ కాలనీలు, బస్తీలలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాలను స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుడి నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల వద్ద మిద్దెల జితేందర్ పూజలు



పూజలు నిర్వహిస్తున్న సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్

**సైదాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో ఏర్పాటు చేసిన గణనాథ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో మండప నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి తరలిన హనుమాన్‌నగర్ గణపతి



నిమర్జనంలో పాల్గొన్న బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** చైతన్యపురి డివిజన్ హనుమాన్‌నగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు, రెడ్డి సంఘం రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు పూర్తయిన సందర్భంగా గురువారం గణపతిని నిమజ్జనానికి తరలించారు. కాలనీకి చెందిన యువతి, యువకులు, మహిళలు నిమజ్జన కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. డప్పు వాద్యాల నృత్యాలు చేస్తూ స్వామివారిని నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో నరేందర్ (క్రాంతికిరణ్‌రెడ్డి), దేవేందర్, రమణారెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్, చంద్రకుమార్, సాయి, సూర్య, రాజు, కోటి, వినోద్‌గౌడ్, అఖిల్‌రెడ్డి, నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండ సురేందర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఎమ్మెల్యే మర్రి సమీక్షా



**మల్కాజ్గిరి సెప్టెంబరు4,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.ఎమ్మెల్యే మల్కాజ్గిరి నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, త్రాగునీటి పైపులైన్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కౌకూర గృహకల్పలో మౌలిక వసతుల కల్పన, త్రాగునీటి ఆలోకేషన్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.కోకూర్ జనప్రియ ఆర్కేడ్ విషయానికి సంబంధించి, అవసరమైన అండర్టేకింగ్ లెటర్ ( అఫిడవిట్)ను తీసుకుని, జలమండలి ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అలాగే, మచ్చ బొల్లారం ప్రాంతంలోని ఏడు కాలనీలకు ట్రంక్ మెయిన్ ఏర్పాటు పనులను 50:50 నిష్పత్తిలో పూర్తి చేయాలని సూచించారు. పంచశీల కాలనీలో త్రాగునీటి సరఫరా పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు.ఇంకా, బోర్ వెల్స్ కు సంబంధించిన మీటర్ల అనుసంధానం కోసం జిహెచ్ఎంసి మరియు జలమండలి అధికారుల మధ్య సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. మల్కాజ్గిరి అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను మంజూరు చేసేందుకు తాను ముమ్మరంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే గారు హామీ ఇచ్చారు.ఈ సమీక్ష సమావేశంలో జలమండలి మేనేజర్ సునీల్, డీజీఎం లు సాంబయ్య, రాజు, మేనేజర్లు మల్లికార్జున్, సృజయ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## త్వరలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం : జలమండలి డైరెక్టర్ శ్రీధర్



డ్రైనేజీ సమస్య గురించి అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. సెప్టెంబర్. 4. ప్రభాతవార్త :** సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ నుంచి హరిహరాపురం వరకు డ్రైనేజీ సమస్య వెంటనే పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు చేసిన రాస్తారోకో మరియు జలమండలి కార్యాలయంలో నిర్వహించిన వంట వార్పు కార్యక్రమానికి స్పందించిన జలమండలి అధికారులతో ఈ రోజు డ్రైనేజీ సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని జలమండలి డైరెక్టర్ శ్రీధర్ గారు మరియు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం నిని రమేష్ బాబు గారు బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆధ్వర్యంలో సాగర్ కాంప్లెక్స్ లోని కల్వర్టులను పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్య శాశ్వత పరిష్కారమయ్యే విధంగా ప్రణాళిక ఏర్పాటు చేయించడం జరిగిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ అధికారుల సమన్వయంతో పనులు ప్రారంభించాలని మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని కోరారు.. అనంతరం గుర్రంగూడా లోని అటవీ శాఖ కార్యాలయంలో అటవీశాఖ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డి తో సమావేశం ఏర్పాటు చేసి అటవీశాఖ అధికారులను కూడా సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీహరి రెడ్డి , ఎల్బీనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే సామ రంగారెడ్డి మరియు జలమండలి సిజిఎం నాగేందర్, జిఎం బలరాంరాజు, మహేందర్, వనస్థలిపురం సిఐ మహేష్ గౌడ్,ఎస్ఐరవి నాయక్,ఇంజనీరింగ్ విభాగం డిఈ దామోదర్ రావు,డిజిఎం రాజగోపాల్, రవీంద్రనాథ్ వర్మ, మేనేజర్ సిరివెన్నెల, సత్యనారాయణ, ఎఈ కార్తీక్ మరియు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## బాలాపూర్ గణేషునికి మహేశ్‌కుమార్‌గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డిల ప్రత్యేక పూజలు



బాలాపూర్ గణేషునికి పూజలు చేసిన టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దంపతులు, సీనియర్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** ప్రఖ్యాత బాలాపూర్ గణేషుడిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ దంపతులు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సీనియర్ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డిలు దర్శించుకున్నారు. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆహ్వానం మేరకు బుధవారం రాత్రి విచ్చేసిన వారు సర్వాంగ సుందర బాలాపూర్ స్వర్ణగిరి గణేష్ మండపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పూజారులచే పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డిలు బాలాపూర్ గజాననుడికి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి వారిని శాలువాలతో సన్మానించి ప్రత్యేక మినీ గణేష్ లడ్డూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రంగారెడ్డి జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ అనితా హరినాథ్‌రెడ్డి, సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, బాలాపూర్ మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర మహేశ్వరి జైహింద్, బందారి మనోహర్, స్థానిక బాలాపూర్ కాంగ్రెస్ నాయకులు బాల్‌నింగని జంగయ్య, టేకుల సుధాకర్‌రెడ్డి, మేకల సంజీవ, గిరికట్టి కృష్ణంరాజుగౌడ్, టేకుల శశిధర్‌రెడ్డి, నీరుడు శ్రీరాములు, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిగిరింత దయాసాగర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్న గణేష్ ఉత్సవాలు



గణపతి మూల మంత్ర హోమం ,లక్ష్మీ కుబేర పూజ కార్యక్రమాల నిర్వహిస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పొద్దుటూరి రవీందర్, గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ ఆమేటి శ్రీనివాస్, పాల మధుసూదన్, రాముని రామనాథం తదితరులు

**మలక్ పేట , సెప్టెంబర్ 4 ,ప్రభాతవార్త:** హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయని గౌరవాధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ , అధ్యక్షులు పొద్దుటూరి రవీందర్, గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ అమేటి శ్రీనివాస్ లు పేర్కొన్నారు. హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూసారాంబాగ్ లోని అసోసియేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద గణపతి మూలా మంత్ర హోమం , లక్ష్మీ కుబేర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని ప్రతిరోజు పలు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తాడిశెట్టి నవీన్ కుమార్, తోట వెంకయ్య, ఉరే శ్రీనివాస్, పాల మధుసూదన్, బచ్చు నిర్మలేష్, ప్రధాన కార్యదర్శి రాముని రామనాథం, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆగీరు రవి కుమార్ గుప్త, మంచికంటి రామచంద్రయ్య, సంయుక్త కార్యదర్శులు ఆకుతోట జగన్ , ఆలంపల్లి శ్రీనివాస్ ,గౌత వివేకనంద్ గుప్తా, గార్లపాటి గణేష్, మలిపెద్ది శ్రీనివాస్, కోశాధికారి నరేష్ కుమార్ గోయల్, గణేష్ ఉత్సవ సమితి గౌరవ చైర్మన్ ఊరే లక్ష్మణ్ ,ప్రధాన కార్యదర్శి వేముల శ్రీధర్, కోశాధికారి మిట్టపల్లి అంజయ్య, గౌరవ సలహాదారులు మోటుకూరి శ్రీనివాస్, ఉత్సవ సమితి మాజీ చైర్మన్ వరగంటి జయరాములు, మేనేజర్ రామారావు, సిబ్బంది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుని దర్శించుకున్న ఎంపి ఈటల, కార్పొరేటర్



**నేరెడ్ మెట్, సెప్టెంబర్ 4,ప్రభాతవార్త.** వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, స్థానిక కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ స్థానిక నాయకులతో కలిసి గురువారం పలు గణేష్ మండపాలను సందర్శించారు.మొదటగా శ్రీ సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అదే కాలనీలో ప్రవీణ్ ఆధ్వర్యంలో నెలకొల్పిన మరో మండపాన్ని దర్శించారు. తర్వాత వినాయక్‌నగర్ లైన్ నెంబర్ 39లో స్వరూప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో పాల్గొని భక్తులతో కలిసి పూజలు చేశారు. బండచెరువు లాల్ వాణినగర్‌లో వినాయక దేవాలయం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మండపాన్ని దర్శించి భక్తులతో మమేకమయ్యారు. అనంతరం లాల్ వాణినగర్ ఆలయ ప్రాంగణంలో జమ్మి చెట్టును నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో, స్థానిక ప్రజలు ఉత్సాహపూరిత పాల్గొనడం విశేషంగా సాగింది. ఈ సందర్భంగా నాయకులు పలు మండపాల్లో అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొని వినాయకుడి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో ఓం ప్రకాష్, గోపాల్, మల్లేష్ యాదవ్, జగదీష్ చారి, తిరుమల, సుమలత, లక్ష్మీ గోపాలకృష్ణ యాదవ్, సంతోష్, సాయిరామ్, రాజేష్ సోమనాథ చారి, వెంకటేష్, మల్లేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి డిగ్రీ కళాశాలలో సంస్కృత విస్తృతోపన్యాసం



**నేరెడ్ మెట్, సెప్టెంబర్ 4,ప్రభాతవార** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృత విభాగం ఆధ్వర్యంలో గురువారం విస్తృతోపన్యాసం నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు తెలిపారు.ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత ఆచార్యులు, బిఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ విద్యానంద్ ఆర్యా ప్రధాన వక్తగా హాజరై సంస్కృత భాషా ప్రాధాన్యత మరియు భవిష్యత్ ఉపాధి అవకాశాలు" అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాసం అందించారు. ప్రాచీన సంస్కృత భాష ఆధునిక సమాజంలోనూ ప్రాధాన్యం కోల్పోలేదని, దాని ఆధారంగా అనేక రంగాలలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు. విద్యార్థులు భాషా పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సంస్కృత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అహల్య సమన్వయం చేశారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా సంస్కృత భాషపై అవగాహన పెంచుకోవాలని సూచించారు

## గణనాథుడికి మధుయాష్కీ గౌడ్ పూజలు



చంపాపేటలో పూజలు నిర్వహిస్తున్న ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మధుయాష్కీ గౌడ్

**సైదాబాద్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ మాధవనగర్ కాలనీలో శ్రీరామ్ సేన గణేష్ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాన్ని ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మధుయాష్కీ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ ముదిరాజ్, ఆల వెంకట్‌రెడ్డి, ఈవూరి బద్రినాథ్ గుప్తా, అంతటి శ్రీనివాస్ గౌడ్, రమాకాంత్ గుప్తా, నర్సింహారెడ్డి, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు బాలాపూర్ గణేషుని పూజల భాగ్యం



బాలాపూర్ గణేషుని సన్నిధిలో పూజలు చేస్తున్న పారిశుధ్య సిబ్బంది: చిత్రంలో పారిజాత, ప్రభాకర్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ యాదగిరి తదితరులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** సుప్రసిద్ధ బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ భక్తులకు, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పని చేస్తున్న బాలాపూర్‌కు సంబంధించిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులను గౌరవిస్తూ వారిచే గణేష్ ఉత్సవ సమితి పూజలు చేయించింది. వినాయక చవితి ప్రారంభం రోజు నుండి ప్రతి రోజూ అందుబాటులో ఉంటూ నిరంతరాయంగా పని చేస్తున్న సానిటేషన్ కార్మికులతో పాటు సానిటేషన్ ఇన్స్‌పెక్టర్, జవాన్లు, వాటర్‌మెన్లు, ఎలక్ట్రీషియన్లచే గణేషునికి పూజలు చేయించి వారిని శాలువాలతో సన్మానించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కళ్ళెం ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రూ.30 వేలు పలికిన నాదర్‌గుల్ జై భజరంగ్‌దళ్ గణేష్ లడ్డూ



లడ్డూను దక్కించుకున్న మంత్రి మహేష్ కుమార్‌గౌడ్

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో జై భజరంగ్ దళ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణేషుడి చేతిలోని లడ్డూ వేలంలో రూ.30 వేల పలికింది. నిమజ్జనం సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు లడ్డూను వేలం వేయగా గ్రామానికి చెందిన సీనియర్ బిజెపి నాయకుడు మంత్రి మహేష్ ముదిరాజ్ అందరి కంటే ఎక్కువ మొత్తంలో వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూ వేలం, నిమజ్జనోత్సవంలో మాజీ ఎంపిటిసి ఏనుగు రాంరెడ్డి, భాగ్యనగర్ మాజీ ఛైర్మన్ పెత్తుల్ల పుల్లారెడ్డి, తోట ప్రతాప్‌రెడ్డి, జక్కిడి మోహన్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, పాలుబాయి అశోక్, లక్ష్మణ్, మర్రి అంజరెడ్డి, మోతకాని పెద్దయ్య ముదిరాజ్, గూడెపు ఇంద్రసేన, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

## లంబోదరుడి మహోత్సవాలు అద్భుతం



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న లక్ష్మీనారాయణ

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** గణేశుడి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించడం అద్భుతమని సరూర్‌నగర్ విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎన్.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని వాసవికాలనీ నివాసుల సంక్షేమ సంఘము అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్త ఆధ్వర్యంలో మహా గణపతి 38వ నవరాత్రి మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమానికి లక్ష్మీనారాయణ దంపతులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవికాలనీ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి అయిత అంజయ్యగుప్త, అష్టలక్ష్మీ దేవాలయ అక్షయ ట్రస్ట్ సెక్రటరీ మాద్యం సుధాకర్‌గుప్తా, చిలుక ఉపేందర్‌రెడ్డి, బంధం దామోదర్‌గుప్తా, ఉత్సవ కమిటీ కన్వీనర్ బచ్చు ప్రభాకర్, కోకన్వీనర్ వెంపటి కృష్ణమోహన్, గౌరిశెట్టి శ్రీనివాస్, మాలే శ్రీనివాస్‌గుప్త, అరుణ్‌కుమార్, వనమా సుదర్శన్, గ్రంధి రమేష్, మాలే అనిల్, తమన్నా శ్రీధర్, భరద్వాజ్, దండు రాజు, లగిశెట్టి వినోద్‌కుమార్, గౌరీశంకర్, సత్యనారాయణ, శుభకర్, కృష్ణమూర్తి, రామస్వామి, మేఘమాల, భ్రమరాంబ, గోలి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడిని దర్శనం చేసుకున్న బిజెపి నేతలు



పూజలో పాల్గొన్న పల్లె గంగారెడ్డి, రాధాధీరజ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ ద్వారకానగర్‌లో భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహా గణనాథుడిని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఆర్కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, బిజెపి మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ ధీరజ్‌రెడ్డి, మహేశ్వరం బిజెపి ఇన్చార్జి శ్రీరాములు అందెల తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా నిర్వాహకులు వారిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ సంతోష్, డివిజన్ బిజెపి అధ్యక్షులు ముంత రాములు, సీనియర్ నాయకులు చిలుకూరి శ్రీనివాస్ బిజెపి, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయి

-న్యూ నోబుల్ డిగ్రీ కళాశాల ఇంచార్జ్ గౌని చంద్రయ్య

**మలక్ పేట, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** గణేష్ ఉత్సవాలు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయని న్యూ నోబుల్ డిగ్రీ, పీజీ కళాశాల ఇంచార్జ్ గౌని చంద్రయ్య, ప్రిన్సిపాల్ ప్రేమలతలు పేర్కన్నారు. ముసారంబాగ్ లోని న్యూ నోబుల్ డిగ్రీ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి వారు విద్యార్థులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో గణేష్ విగ్రహాన్ని విద్యార్థులతో కలిసి నిమజ్జనానికి ఊరేగింపుగా తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలను కళాశాలలో నిర్వహించడంతో విద్యార్థులకు పండుగలు వాటి విశిష్టత, ప్రాధాన్యత గురించి అవగాహనా ఏర్పడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### బాలాజీ ఎన్‌క్లేవ్ పార్కు అభివృద్ధికి చర్యలు : బన్నాల గీత



చిలుకానగర్ బాలాజీ ఎన్‌క్లేవ్‌లో పార్కు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని స్థానిక కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పలువురు జిహెచ్ఎంసి అధికారులతో కలిసి బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీలో జిహెచ్ఎంసి హార్టికల్చర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన పార్కు సుందరీకరణ పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బన్నాల గీత మాట్లాడుతూ డివిజన్‌లో గతంలో ఎన్నడులేని విధంగా పార్కులలో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. పార్కుల అభివృద్ధికి అధికంగా నిధులు తీసుకుని వస్తున్నామన్నారు. పార్కులలో ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. అదే విధంగా పార్కులో మరిన్ని బెంచీలు, ప్రహరిగోడ నిర్మించాలని కాలనీ నేతలు సూచించారు.ఈ కార్యక్రమంలో బాలాజీ ఎన్‌క్లేవ్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, కాలనీ నేతలు వేణుగోపాల్ రెడ్డి ఓంకార్ సింగ్, కమిటీ సభ్యులు రమణ, కెనడి,షేక్ మస్తాన్ వలి, సిద్దేశ్వర్, శ్రీనివాస్‌చారి, శశి కుమార్, భరత్‌రెడ్డి సత్యనారాయణరెడ్డి, కేశవరెడ్డి, ప్రదీ ప్, ప్రవీణ్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్‌రెడ్డి, కె.జగన్ ,బింగి శ్రీనివాస్ ,మహమూద్ పాల్గొన్నారు.

### ఉప్పల్ లో 8వ తేదీ నుంచి క్రీడాకారుల ఎంపిక

**ఉప్పల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్ స్థాయి 69వ కబడ్డీ, ఖోఖో వాలీబాల్ పోటీలు సెప్టెంబర్ 8.9, 10 వ తేదీలలో ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జోనల్ కార్యదర్శి జి.పద్మావతి తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు జరుగుతాయని తెలిపారు. అండర్ -14 విద్యార్థులు జనవరి 1, 2012 తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. అండర్-17 విద్యార్థులు జనవరి 1, 2009 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు..క్రీడాకారులు తమ స్కూల్ బోనఫైడ్,పెన్ నంబర్, ఆధార్ జిరాక్సులతో సెప్టెంబర్ 8 వ తేదిన ఉదయం 9గంటలకు ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిపోర్ట్ చేయాలన్నారు, ఇతర వివరాలకు జోనల్ కార్యదర్శి జి. పద్మావతి 92900 93852 నెంబరులో సంప్రదించాలని కోరారు.

### జిఎస్‌టిపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై బిజెపి హర్షం



ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగిస్తున్న బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీందర్, ధర్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** జిఎస్‌టిపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నిరుపేదలకు ఎంతో మేలు చేస్తుందని బిజెపి ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు మార్నెనీ ఫణీంద్ర, సీనియర్ నేత శామీర్‌పేట ధర్మారెడ్డిలు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి విషయంలో తీసుకున్న ఎంతో మందికి మేలు చేస్తుందన్నారు.ప్రధాని మోడీ భవిష్యత్‌లో మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో అవినీతిరహిత పాలన, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే కాకుండా మధ్య,దిగువ మధ్య తరగతి ప్రజల నిత్యావసరాల వస్తువులపై భారం తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. జిఎస్‌టిపై నిర్ణయం తీసుకున్న ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విట్టల్ రావు ముదిరాజ్, కోశాధికారి దువ్వాల రమేశ్ , యువ మోర్చా నాయకులు ఆడెపు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### హబ్సిగూడలో రికార్డుస్థాయిలో వినాయక లడ్డూ వేలంపాట



హబ్సిగూడలో వినాయక లడ్డూ వేలంపాటలో రికార్డు ధరకు సొంతం చేసుకున్న కొమ్మారెడ్డి దామోదర్‌రెడ్డి దంపతులు

**ఉప్పల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త :** హబ్సిగూడ గణేష్ ఉత్సవ సమితి స్ట్రీట్‌నెం.8 ఆధ్వర్యంలో జెఎన్ఎన్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గురువారం గణేష్ లడ్డూ వేలంపాట రికార్డు స్థాయిలో జరిగింది. ఉత్సవ కమిటి మెంబర్లు జిల్లెల రవీందర్‌రెడ్డి, రొండ్ల దామోదర్‌రెడ్డి, రెడ్డి శిరీష్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఎం.అరవింద్‌రెడ్డి, మర్రి రంజిత్‌రెడ్డి, మారం ప్రదీప్‌రెడ్డి, కొమ్మిడి మల్లారెడ్డి, టోక్మో మహేందర్‌రెడ్డి, గుర్రాల అజిత్‌రెడ్డి, వాడేపల్లి వీరేందర్, హరీష్ మతాడే ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వినాయక లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీ నేత్త కొమ్మారెడ్డి దామోదర్‌రెడ్డి దంపతులు రూ.2లక్షల 60వేలకు లడ్డూ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వినాయక జరిగిన నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఉత్సవ సమితి నేతలు హబ్సిగూడ పుర వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కె.తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.